

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి మంగళవారం 03-03-2026 సంపుటి : 07 సంచిక 284 పేజీలు : 8 వెల : రూ 3-00


# ప్రజల మనసు గెలవడమే లక్ష్యం..



## పబ్లిక్ పర్సెప్షన్‌పై ముఖ్యమంత్రి దిశానిర్దేశం

అమరావతి: ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు తన పాలనలో 'రియల్-టైమ్ గ్రాస్ సెటిల్మెంట్' 'పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్' ప్రజాభిప్రయాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. సోమవారం ఆర్టీజీఎస్, పబ్లిక్ పాజిటివ్ పర్షెప్సన్‌పై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సేవలపై ప్రజలు సంపూర్ణంగా సంతృప్తి చెందాల్సిందేనని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. అధికారుల తీరుపై ప్రజల నుంచి ఫిర్యాదులు రాకూడదని తేల్చిచెప్పారు. ఈ నెల నుంచి కనీసం 80 శాతం నుంచి 90 శాతం తగ్గకుండా పబ్లిక్ పర్షెప్సన్ ఉండాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా అధికారులతో ఆయన మాట్లాడుతూ..'పెన్షన్ల పంపిణీలో లోటుపాట్లు తలెత్తుతున్న స్వర్ణ గ్రామాలు, స్వర్ణ వార్డులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. ఆర్టీసీ బస్సు సర్వీసులు బావున్నా.. ఆర్టీసీ బస్ స్టేషన్‌లో సౌకర్యాలు, ఔట్ సోర్సింగ్ సర్వీసులు మెరుగ్గా ఉండేలా చర్యలు చేపట్టాలి. బస్ స్టేషన్‌కు వచ్చిన దగ్గర నుంచి గమ్యస్థానం చేరే వరకు ప్రయాణం సౌకర్యవంతంగా ఉండాలి. రాష్ట్రంలో వరుస ప్రమాదాలు, సంఘటనలపై అప్రమత్తంగా ఉండాలి, ముందస్తు జాగ్రత చర్యలు తీసుకోవాలి. బాణసంచా పేలుడు ఘటనలు పునరావృతం కాకుండా రక్షణ చర్యలపై అధికారులు శివకాశీకి వెళ్లి అధ్యయనం చేసిరావాలి. రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, డిజిటల్ సేవలు, సిబ్బంది పనితీరు బాగుంది. అవినీతికి తావులేకుండా రాష్ట్రంలోని మొత్తం 295 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిజాయితీ కలిగిన అధికారులకే అవకాశం ఇవ్వాలి. వాట్సప్ మనమిత్ర సేవలు వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి, నూటికి నూరు శాతం వాట్సప్ సేవల వినియోగం జరగాలి. అన్ని శాఖల పనితీరు మెరుగు పరుచుకునేందుకు అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి' అని అన్నారు.

## ఇరాన్‌పై యుద్ధం నాలుగైదు వారాలు కొనసాగొచ్చు : డొనాల్డ్ ట్రంప్

ఇరాన్ పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో యుద్ధం మరో నాలుగైదు వారాలపాటు కొనసాగే అవకాశం ఉందని అన్నారు.'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' పూర్తిస్థాయిలో కొనసాగుతోందని ట్రంప్ తెలిపారు. ఈ సందర్భంగా తనపై గతంలో జరిగిన హత్యాయత్నాల ఘటనలను ఆయన ప్రస్తావించారు. 'ఖమేనీ ప్రోద్బలంతో నాపై రెండుసార్లు హత్యాయత్నాలు జరిగాయని, కానీ నేను మొదటి ప్రయత్నంలోనే అతడి కథ కంచికి చేర్చా' అని పేర్కొన్నారు. 'నన్ను పట్టుకోకముందే నేనే అతడిని పట్టుకొన్నా' అని చెప్పారు.ఇరాన్ పై ఆపరేషన్ క్లిష్టమైనదేనని, కానీ విస్తృత స్థాయిలో దాడులు జరుపుతున్నామని ట్రంప్ అన్నారు. అవసరమైతే ఈ ఆపరేషన్ నాలుగైదు వారాలు కొనసాగవచ్చునని తెలిపారు. యుద్ధ తీవ్రతను ఇదేవిధంగా కొనసాగించడం ఇజ్రాయెల్ అమెరికాకు కష్టమేమీ కాదని అన్నారు. చర్చల కోసం తమ దౌత్య మార్గాలు ఇప్పటికీ తెరిచే ఉన్నాయని తెలిపారు.

# భారత్ ఎప్పుడూ శాంతియుత పరిష్కారాన్నే కోరుకుంటుంది: ప్రధాని మోదీ





న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ప్రస్తుత పరిస్థితిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. దౌత్యం, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలన్నదే ఇండియా నిశ్చితాభిప్రాయమని అన్నారు. భారత్ ఎప్పుడూ శాంతినే కోరుకుంటుందని పేర్కొన్నారు. భారత్‌లో పర్యటిస్తున్న కెనడా ప్రధానమంత్రి మార్క్ కార్నేతో కలిసి మీడియా సంయుక్త సమావేశంలో ప్రధాని మాట్లాడారు.ఉగ్రవాదం విసురుతున్న సవాళ్లను మోదీ ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, రాడికలైజేషన్ మనకే కాక ప్రపంచ దేశాలకు సవాళ్లు విసురుతున్నట్టు చెప్పారు. దీనిపై సమష్టిగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి బెదిరింపులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రపంచ శాంతి, సుస్థిరత కోసం దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని అన్నారు. ప్రపంచవ్యాప్త ఉద్రిక్తతల విషయంలో భారత్ వైఖరి ఎప్పుడూ ఒకటేనని, శాంతి, సుస్థిరత కీలకమని, రెండు ప్రజాస్వామ్య దేశాలు కలిసి పనిచేస్తే శాంతి మరింత పటిష్టమవుతుందని అన్నారు. ప్రపంచ దేశాల్లో భారతీయులు ఎక్కడున్నా వారితో ఎప్పుడూ సంప్రదింపులు జరుపుతూ వారి భద్రతకు భారత్ కట్టుబడి ఉంటుందని చెప్పారు.అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ గత శనివారంనాడు ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని 30 చోట్ల దాడులు జరిపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం నేత అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై ఇరాన్ ప్రతిదాడులకు దిగింది. ఇజ్రాయెల్, అరబ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్ దాడులతో విరుచుకుపడింది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ శాంతియుత పరిష్కారాని పిలుపునిచ్చారు. కాగా, కెనడా ప్రధాని మార్క్ కార్నీ భారత్ పర్యటనకు విచ్చేయడంతో విద్యుత్, టెక్నాలజీ రంగాల్లో సహకరించుకోవాలని ఇరుదేశాలు నిర్ణయించాయి. గ్లోబల్ బయోఫ్యూయల్ కూటమిలో చేరాలని కూడా కెనడా నిర్ణయం తీసుకుంది.

## రాజధాని నిర్మాణ పనుల ఆలస్యంపై మంత్రి నారాయణ ఆగ్రహం

అమరావతి, మార్చి 2: రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ఆలస్యం చేస్తున్నారంటూ కాంట్రాక్టు సంస్థలపై మంత్రి నారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజధాని ప్రాంతంలో మంత్రి పర్యటించారు. నేలపాడు ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న గెజిటెడ్ అధికారుల క్వార్టర్స్, గ్రూప్-డి ఉద్యోగుల క్వార్టర్స్‌తో పాటు వివిధ నిర్మాణాలను పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేయలేకపోతే వెళ్లిపోవాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులపై మంత్రి నారాయణ అసహనం వ్యక్తం చేశారు.షాపూర్ జీ పల్లోంజీ కన్స్ట్రక్షన్ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులను వెంటనే పంపించేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఆ సంస్థ యాజమాన్యం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికిపనుల ఆలస్యంపై సంజాయిషీ ఇవ్వాలని మంత్రి నారాయణ ఆదేశించారు. రాజధాని నిర్మాణాలు వేగంగా, నాణ్యతగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు మంత్రి సూచించారు.



## సౌదీలోని అతిపెద్ద రిఫైనరీపై ఇరాన్ దాడి..

అమెరికా స్థావరాలే లక్ష్యంగా ఇరాన్ చేస్తున్న ప్రతీకార దాడులతో పశ్చిమాసియా అట్టుడుకుతోంది. ఇప్పటికే అనేక భవనాలు, కీలక స్థావరాలు నేలమట్టం అయ్యాయి. అయితే తాజాగా సౌదీ అరేబియాలోని అతిపెద్ద చమురు శుద్ధి కేంద్రాల్లో ఒకటైన అరామ్‌కో రిఫైనరీపై ఇరాన్ డ్రోన్ దాడి చేసినట్లు తెలుస్తోంది. రాస్ తనురాలోని ఈ రిఫైనరీపై షాహెద్-136 డ్రోన్‌తో దాడి చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీనికి సంబంధించిన దృశ్యాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతోన్నాయి. ఈ దాడి ప్రభావం చమురు ధరలపై ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.అంతర్జాతీయమీడియా కథనం ప్రకారం.. ఇరాన్ అరామ్ కో రిఫైరనరీపై దాడి చేసింది. ఈ దాడి కారణంగా చమురుశుద్ధి కేంద్రం వద్ద భారీగా మంటలు చెలరేగాయి. ఈ ఘటన నేపథ్యంలో రిఫైనరీని తాత్కాలికంగా మూసివేసినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి. అయితే, ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని సమాచారం. ఈ ఘటనలో ఇప్పటివరకు ఆస్తి, ప్రాణనష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులకు ఇరాన్ ప్రతీకార దాడులకు దిగిన తరువాత చమురు ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ యుద్ధం కారణంగా వివిధ దేశాలకు ఇంధన కొరత ఏర్పడనుంది. ఇప్పటికే యుద్ధం కారణంగా చమురు ధరలు మండుతున్నాయి. చమురు రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాను ఇరాన్ అడ్డుకోవడంతో ధరలు 10 శాతం మేర పెరిగాయి.ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 80 డాలర్లు దాటింది. ఇప్పుడు తాజా దాడులతో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇంధన ధరలు పెరుగుదల అనేది సామాన్యులు వినియోగించే కిరాణా సామాగ్రి, ఇతర వస్తువుల ధరలపై ప్రభావం చూపనుంది. చాలా మంది వినియోగదారులు ఇప్పటికే పెరిగిన ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్నారు. మరోవైపు, పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు కొనసాగుతున్నాయి. కువైట్‌లోని అమెరికా ఎంబసీపై డ్రోన్ దాడి జరగ్గా.. దుబాయ్, దోహా, అబుదాబి, జెరూసలెంలోనూ సోమవారం పేలుడు శబ్దాలు వినిపించాయి.

# వినూత్న బోధనలో ఆ టీచర్ ఆదర్శంగా నిలిచారు: మంత్రి నారా లోకేశ్



అమరావతి, మార్చి2 : సృజనాత్మక విద్యా బోధనతో విద్యార్థుల్లో ఆసక్తిని పెంచుతున్న శ్రీకాకుళం జిల్లా టీచర్ కూర్మాన అరుణకుమారిని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. జి.సిగడాం మండలం పున్నాం పంచాయతీ బూటుపేట ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న అరుణకుమారి వినూత్న పద్ధతులతో పాఠాలను బోధిస్తున్నారని కొనియాడారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేశ్ ట్వీట్ పెట్టారు. అరుణకుమారి టీచర్ సంప్రదాయ బోధనకు భిన్నంగా సృజనాత్మక పద్ధతులను అనుసరిస్తున్నారని మెచ్చుకున్నారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలతో మాత్రమే కాకుండా విద్యార్థులకు అర్థమయ్యేలా బొమ్మలు రూపొందించడం, పాఠాలకు సంబంధించిన షార్ట్ ఫిల్మ్స్ తయారు చేయడం, వర్కింగ్ మోడల్స్ ద్వారా ప్రాక్టికల్ అవగాహన కల్పించడం, పిల్లలతో ప్రత్యక్ష కార్యకలాపాలు చేయించడం వంటి పద్ధతులను అమలు చేస్తున్నారని ప్రశంసించారు. ఈ విధానం వల్ల విద్యార్థులు సులభంగా పాఠాలను అర్థం చేసుకుంటున్నారని మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా చిన్న తరగతుల పిల్లల్లో నేర్చుకునే ఆసక్తి పెరుగుతోందని చెప్పుకొచ్చారు. గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్, రాష్ట్ర, జాతీయ స్థాయి విద్యా శిక్షణల్లో కేఆర్పీగా, మాడ్యూల్ రచయితగా, ఈ?కంటెంట్ సృష్టికర్తగా అరుణ కుమారి టీచర్ ఎనలేని కృషి చేస్తున్నారని ప్రశంసించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఆధునిక, సృజనాత్మక బోధన సాధ్యమేనని ఈ టీచర్ నిరూపించారని తెలిపారు. పరిమిత వనరులతో కూడా నాణ్యమైన విద్య అందించవచ్చని ఆమె చూపించారన్నారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడం, పాఠశాలపై ఆసక్తి కల్పించడం, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారని కొనియాడారు. అరుణకుమారి టీచర్ గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్‌లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారువినూత్న డిజిటల్ బోధన చేస్తూ బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. టీచర్ కృషి వల్ల విద్యార్థుల్లో ప్రాథమికంగా చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలు మెరుగుపడుతున్నాయని వివరించారు.




# సంపాదకీయం

మంగళవారం 03-03-2026

## ముగిసిన ఖమేనీ శకం

ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సంయుక్త వైమానిక దాడుల్లో మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా ధృవీకరించింది. టెహ్రాన్‌లోని ఆయన నివాసం లక్ష్యంగా జరిగిన ఈ దాడిలో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, కీలకమైన సైనిక నాయకులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ వార్త ధృవీకరణ కావడంతో ఇరాన్ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాప దినాలను ప్రకటించింది. దశాబ్దాల కాలం పాటు ఇరాన్ రాజకీయ, సైనిక వ్యవస్థను శాసించిన ఒక శకం దీనితో ముగిసింది. ఖమేనీ మరణంతో అమెరికా, ఇజ్రాయెల్ పంతం నెగ్గినట్లయింది. అయితే యుద్ధం ముగిసిపోతుందా అంటే చెప్పడం కష్టం. ఖమేనీ చనిపోయినా ఇరాన్ లొంగిపోయే అవకాశాలు కనిపించడం లేదు. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, నాయకత్వ బాధ్యతలను తాత్కాలికంగా ముగ్గురు సభ్యుల కౌన్సిల్ స్వీకరించింది. కానీ క్షేత్రస్థాయిలో పట్టున్న ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ప్రతీకారేచ్ఛతో ఉంది. ఇప్పటికే అమెరికా స్థావరాలపై , ప్రాంతీయ మిత్రదేశాల లక్ష్యాలపై ఇరాన్ క్షిపణి దాడులను ముమ్మరం చేసింది. నాయకత్వ శూన్యతను పూడ్చుకునే క్రమంలో ఇరాన్ మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా విశ్లేషిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ ఆపరేషన్‌ను ధ్యప్రాచ్యంలో శాంతి స్థాపనకు లభించిన గొప్ప అవకాశంగా అభివర్ణించారు. ఇరాన్ పాలనలో మార్పు రావాలని అమెరికా ఆశిస్తున్నారు. అంటే లొంగిపోవాలని ఆయన కోరుకుంటున్నారు. కానీ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తమ ఆపరేషన్ ఇంకా ముగియలేదని, ఇరాన్ అణు , క్షిపణి వ్యవస్థలే తదుపరి లక్ష్యాలని స్పష్టం చేశారు. ఈ పరిణామం వల్ల మధ్యప్రాచ్యం ఒక్కసారిగా అనిశ్చితిలోకి వెళ్లిపోయింది. దుబాయ్, బహ్రెయిన్ వంటి వాణిజ్య కేంద్రాలపై దాడులు పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఇరాన్ తన తదుపరి వారసుడిని ఎన్నుకునే ప్రక్రియలో ఉంది. ఖమేనీ కుమారుడు వారసుడు అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయితే అమెరికా ప్రోద్బలంతో అధికార మార్పిడి సజావుగా సాగదని.. అంతర్గత తిరుగుబాట్లకు దారితీసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఇరాన్ లోపల అంతర్యుద్ధం వంటి పరిస్థితులు తలెత్తితే, అది ప్రపంచ చమురు సరఫరాను , ఆర్థిక వ్యవస్థను కోలుకోలేని విధంగా దెబ్బతీస్తుంది. యుద్ధం ఆగిపోవడానికి బదులు, ఇది ఒక సుదీర్ఘమైన ప్రాంతీయ సంఘర్షణకు ఆరంభంగా మారుతుందేమోనన్న భయం గల్ఫ్ దేశాల్లో నెలకొంది. అందుకే ఖమేనీ అంతంతో అన్నీ అయిపోలేదు.. అసలు సమస్యలు ముందున్నాయని ప్రపంచదేశాల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై క్షిపణులతో విజృంభించాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని హతమార్చాయి. ఖమేనీ కూతురు, అల్లుడి కూడా ఈ దాడుల్లో మరణించినట్లు ఇరానీ మీడియా వర్గాలు వెల్లడించాయి. ఖమేనీ మరణంతో పాటు 40 రోజుల పాటు సంతాప దినాలు ప్రకటిస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వం ప్రకటించింది. శనివారం మధ్యాహ్నం నుంచి మొదలైన యుద్ధం నిర్విరామంగా కొనసాగుతోంది. ఖమేనీని హతమార్చుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత కొంతకాలంగా ప్రకటిస్తూ వస్తోన్నారు. చివరికి ఇజ్రాయెల్‌తో కలిసి తన శపథాన్ని ట్రంప్ నెరవేర్చుకున్నారు. అయితే ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతలతో ప్రపంచ మార్కెట్లు కుదేలవుతున్నాయి. బంగారం, వెండి ధరలు మండిపోతున్నాయి. ఖమేనీ మరణంతో యుద్ధం మరింత ముదిరే అవకాశముంది. గల్ఫ్ దేశాలైన దుబాయ్, ఖాతార్, అబుదాబిపై ఇరాన్ ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. గల్ఫ్ దేశాలపై కూడా యుద్ధ ప్రభావం పడటంతో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో బంగారం ధరలు సోమవారం రికార్డ్ దిశగా దూసుకెళ్లే అవకాశముందని మార్కెట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైన కొద్ది సేపటికే ముందుగా క్రిప్టో కరెన్సీలపై దీని ప్రభావం పడింది. బిట్ కాయిన్ 5 శాతం పడిపోయి 64 వేల డాలర్ల మార్క్ కంటే దిగువకు పడిపోయింది. యుద్ధ ప్రభావంతో సోమవారం నుంచి మార్కెట్లు అస్థిరంగా ఉండవచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక పసిడి ధరలు సరికొత్త రికార్డులు సృష్టించచొచ్చని చెబుతున్నారు. ఇక ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం, అమెరికా కూడా యుద్ధంతో పాల్గొనడంతో ముడి చమురు ధరలు పెరిగే అవకాశం కనిపిస్తోంది. యుద్ధ ప్రభావం వల్ల ఇరాన్‌లో చమురు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ క్రమంలో ముడి చమురు ధర బ్యారెల్‌కు 80 డాలర్లు దాటి వెళ్లవచ్చని అంటున్నారు. ఇజ్రాయెల్-అమెరికా దాడులతో ప్రపంచ చమురు రవాణాకు కీలకమైన హోర్ముజ్ జలసంధి వద్ద ఉద్రిక్త వాతావరణ నెలకొంది. భారత్ తన క్రూడ్ ఆయిల్ దిగుమతుల్లో సగానికిపైగా పైగా ఈ జలసంధి నుంచే తీసుకువస్తోంది. దీంతో ఈ అంశం తీవ్ర ఆందోళనలు కలిగిస్తోంది. ఇక్కడ రవాణాకు ఏ మాత్రం ఆంటంకం ఏర్పడినా ఇంధన, సరకు రవాణా వ్యయాలు భారీగా పెరుగుతాయి. భారత ఆర్థిక వ్యవస్థపై ఇది పెను భారాన్ని మోపనుంది. ముడి చమురు ధరలు పెరిగితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలపై ప్రతికూల ప్రభావం పడుతుంది. దీంతో దేశవ్యాప్తంగా సరకు రవాణా ఖర్చులు పెరిగేందుకు అవకాశం ఉంది. ఎర్ర సముద్రంలో భద్రత లేకపోతే నౌకలు ఆఫ్రికా మీదుగా ప్రయాణించాల్సి వస్తుంది. దీంతో సరకు రవాణా సమయం 15-20 రోజులు అవుతుంది. దీంతో ఖర్చు 50 శాతం వరకు పెరుగుతంది.

## వారి రేషన్ కార్డులు రద్దు, జాబితా సిద్ధం – అనూహ్య నిర్ణయం..!!

రేషన్ సరఫరాలో కీలక మార్పుల దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అర్హులందరికీ రేషన్ అందే విధంగా సంస్కరణలు ప్రారంభించింది. అదే విధంగా రేషన్ కార్డుల రద్దు పైన పౌర సరఫరాల శాఖ అధికారులు నివేదిక సిద్ధం చేస్తున్నారు. తాజాగా అందిన ఆదేశాల మేరకు మండల స్థాయి నుంచి ప్రభుత్వానికి నివేదికలు అందనున్నాయి. కాగా, కొత్త రేషన్ కార్డుల మంజూరు విషయం లో లబ్దిదారులకు మంజూరు పైన జిల్లాల వారీగా లెక్కలు తీస్తున్నారు. దీంతో, తాజా ప్రతిపాదనల మేరకు పెద్ద సంఖ్యలో రేషన్ కార్డులకు కోత పడే అవకాశం కనిపిస్తోంది. తెలంగాణలో రేషన్ సరఫరాలో ప్రభుత్వం కీలక మార్పులకు సమాయత్తం అవుతోంది. ప్రతీ నెలా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కొందరు లబ్దిదారులు తీసుకోవటం లేదనే అంశం ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో...అనర్హులను గుర్తించే అంశం పైన ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పూర్తి లెక్కలు చేపట్టే పని ప్రారంభించింది. రేషన్ లబ్ధిదారుల్లో వరుసగా గత



ఆరు నెలలుగా ఎవరెవరు బియ్యం తీసుకోవడం లేదో, ఆ వివరాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి మండల తహసీల్దార్ ఆఫీస్? లాగిన్‌కు సిబ్బంది పంపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్ద సంఖ్యలో కొత్త కార్డులను మంజూరు చేసింది. వీరిలో చాలామంది సన్న బియ్యం తీసుకోవటం లేదని గుర్తించారు. దీంతో, అసలు కారణాలేమిటో గుర్తించాలని అధికారులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. క్షేత్ర స్థాయి నివేదికల మేరకు నిర్ణయం కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం తీసుకొని వాటిని 10 నుంచి 20 రూపాయాల వకు అమ్ముకుంటున్న అంశం పైన క్షేత్ర స్థాయి నుంచి అధికారులు సమాచారం అందించారు. దీని కారణంగా ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పక్క దారి పడుతోంది. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పోషకాలతో ఉన్నా.. మార్కెట్ లో దొరికే సాధారణ బియ్యం వైపే మొగ్గు చూపుతున్నట్లు గుర్తించారు. దీంతో.. ప్రభుత్వం ఆరు నెలల పాటు బియ్యం తీసుకోని వారి జాబితాలను సిద్దం చేయాలని పౌర సరఫరాల శాఖ కు సూచించింది. ఈ మేరకు క్షేత్ర స్థాయి నుంచి అధికారులు నివేదికలను సిద్దం చేస్తున్నారు. దీని ద్వారా ఆరు నెలలు రేషన్ తీసుకోని వారి కార్డులను రద్దు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని పైన పూర్తి నివేదికలు అందిన తరువాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.

## వారికి బంపర్ ఆఫర్ ఇచ్చిన ఆర్టీసీ.. మహిళలకే కాదు వారికి బస్సులు ఫ్రీ!

తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీ బస్సు సేవలలో గణనీయమైన మార్పులకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అందిస్తోంది. రాష్ట్రంలో మహిళలు, బాలికలు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ బస్సుల్లో తెలంగాణ సరిహద్దులలోపు ఎక్కడి నుంచైనా జీరో టికెట్‌తో ప్రయాణించవచ్చు. అంతర్రాష్ట్ర పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులకైతే సరిహద్దు వరకు ఈ సౌకర్యం వర్తిస్తుంది. మహిళలకే కాదు వారికి ఫ్రీ బస్సులు మహిళలకు మాత్రమే కాదు కొందరు పురుషులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కలిగించాలని తెలంగాణా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దివ్యాంగ పురుషులు, బాలురకు కూడా ఈ సౌకర్యం కల్పించాలంటూ కొంతకాలంగా పెద్ద ఎత్తున డిమాండ్లు వినిపిస్తున్న వేళ తెలంగాణా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఏపీలో కూడా ప్రభుత్వం దివ్యాంగులకు ఇంద్రధనుస్సు పేరుతో నిన్నటి నుండి ఉచిత బస్సు ప్రయాణాలను ప్రారంభించింది. మరిన్ని కనుగొనండి టెన్నిస్ రాకెట్లు క్రికెట్ అప్డేట్స్ రాజకీయ విశ్లేషణ ప్రాంతీయ వార్తలు విద్య ఉద్యోగ కోర్సులు క్రీడ జాతీయ వార్తలు జీరో టికెట్ తోనే వారికి



ప్రయాణ సేవలు తాజాగా దివ్యాంగుల డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం, రాష్ట్ర దివ్యాంగ పురుషులకు ఆర్టీసీ బస్సుల్లో 100శాతం ఉచిత ప్రయాణం కల్పిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో దివ్యాంగ పురుషులు టికెట్ ధరలో 50శాతం రాయితీతో ప్రయాణం చేసేవారు. ఉదాహరణకు, రూ. 50 టికెట్‌కు రూ. 25 చెల్లింపు చేయాల్సి ఉండేది. ఇప్పుడు మహిళల మాదిరిగా జీరో టికెట్‌తో ఎలాంటి చెల్లింపులు లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించింది రేవంత్ సర్కార్. హర్షం వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు రేవంత్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం పట్ల దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉచిత ప్రయాణం తమకు ప్రయాణాన్ని సులభతరం చేస్తుందని, ఆర్థికంగా లబ్ధి చేకూరుస్తుందని వారు పేర్కొన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభమయ్యాక ఆర్టీసీ బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. గతంలో రోజుకు 25-30 లక్షలున్న ప్రయాణాలు తాజాగా 60 లక్షలకు చేరాయి.

## భద్రాద్రిలో శ్రీరామనవమి కళ్యాణోత్సవం

### సమీక్షా భేటిలో పాల్గొన్న మంత్రి పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెం,భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం నందు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్న వసంతపక్ష తిరు కళ్యాణ నవహాన్నిక బ్రహ్మోత్సవాలతోపాటు ఈనెల 27వ తేదీన జరగనున్న శ్రీరామనవమి కళ్యాణం ఏర్పాటులకు సంబంధించి సమీక్ష సమావేశం భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయం నందు జిల్లాలో ఉన్నటువంటి వివిధ శాఖల అధికారులతో తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి మరియు గృహ నిర్మాణ శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నిర్వహించారు..ఈ సమీక్ష సమావేశంలో భాగంగా భద్రాచలం శ్రీ



సీతారామచంద్రస్వామి దేవస్థానం రామాలయంలో ఈనెల18వ తేదిన శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కళ్యాణము మరియు పట్టాభిషేకం మహోత్సవాల కోసం ఏర్పాట్లపై అయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.... దీనిలో భాగంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుండి వచ్చేటటువంటి భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని భక్తులకు మజ్జిగ మరియు మంచినీరు ప్యాకెట్లు అందించాలని ఆయన సూచించారు . సీతారాముల వారి కళ్యాణానికి ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు ...భద్రాచలం నుండి పర్ణశాల వెళ్ళేటటువంటి రోడ్డు మార్గం గుంతలు గుంతలుగా ఉందని వాటన్నిటిని వెంటనే ఆర్ అండ్ బి శాఖ అధికారులు మరమ్మత్తులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈసారి రాముల వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరగాలని భద్రాచలం బ్రిడ్జిపై కూడా లైటింగ్ ఏర్పాట్లను చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు..భక్తులకు లడ్డూ ప్రసాదం ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు చేపట్టాలని ఆలయ అధికారులను ఆయన ఆదేశించారు ఆ విధంగా లడ్డూను తయారుచేసి తాజా లడ్డూను భక్తులకు అందజేయాలని మరియు లడ్డులో నాణ్యత లోపాల తలెత్తకుండా చూడాలని ఆయన ఫుడ్ ఇన్స్పెక్టర్లుకు సూచనలు చేశారు..

## ఎఫ్-15 ఫైటర్ జెట్ క్రాష్.. అమెరికా యుద్ధ విమానాలు కూలాయన్న కువైట్



కువైట్ సిటీ: అమెరికాకు చెందిన ఎఫ్-15 ఫైటర్ జెట్ సోమవారం ఉదయం కువైట్‌లో క్రాష్ అయ్యింది. అమెరికాకు చెందిన పలు యుద్ధ విమానాలు కూలినట్లు కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే తామే కూల్చినట్లు ఇరాన్ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధం మూడో రోజుకు చేరింది. సోమవారం ఉదయం ఒక ఎఫ్-15 ఫైటర్ జెట్ కువైట్‌లో కూలిపోయింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కాగా, కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఈ విషయాన్ని ధృవీకరించారు. అమెరికాకు చెందిన పలు యుద్ధ విమానాలు కూలినట్లు తెలిపారు. అయితే పైలట్లు సురక్షితంగా ఉన్నట్లు చెప్పారు. రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినట్లు వివరించారు. యూఎస్ ఫైటర్ జెట్స్ కూలడానికి కారణం ఏమిటన్నది తెలియలేదని, దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. మరోవైపు ఒక ఎఫ్-15 ఫైటర్ జెట్‌ను తాము కూల్చినట్లు ఇరాన్ ప్రకటించింది. అదే సమయంలో కువైట్‌లోని అమెరికా రాయబార కార్యాలయం నుంచి పొగలు వచ్చిన దృశ్యాలు కనిపించాయి. అయితే పొరపాటున పేట్రియాట్ వైమానిక రక్షణ వ్యవస్థ యాక్టివేట్ కావడంతో 'ఫ్రెండ్లీ ఫైర్' జరిగినట్లు పలు మీడియా సంస్థలు అనుమానం వ్యక్తం చేశాయి. దీంతో ఎఫ్-15 కూలినట్లు భావిస్తున్నారు. కాగా, యుద్ధ విమానాలు కూలడాన్ని అమెరికా లేదా ఇజ్రాయెల్ ఇంకా ధృవీకరించలేదు.

## తొలి రోజు ప్రజావాణిలో అధికారులకు కలెక్టర్ అంకిత్ ఝలక్



భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 02 : భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్ అంకిత్ తొలి రోజు ప్రజావాణి నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు అధికారులు అందరూ హాజరు కావాలని అంతకుక్రితం రోజే ప్రకటన జారీ చేశారు. అయినా 11 గంటల వరకు సైతం కొద్దిమంది జిల్లా అధికారులు మాత్రమే ప్రజావాణికి హాజరయ్యారు. ఎప్పటిలాగే పలువురు అధికారులు హాజరు కాలేదు. అప్పటికే 11 దాటడంతో అధికారుల నుండి అటెండెన్స్ తీసుకోమని కలెక్టర్ ఆదేశించారు. దీంతో వచ్చిన వారు, వివిధ శాఖల అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సంతకాలు పెట్టారు. ఇది గమనించిన కలెక్టర్ జిల్లా అధికారులు మాత్రమే సంతకాలు పెట్టిన షీట్ ఇవ్వాలని చెప్పడంతో అధికారులు తడబడి అప్పటికప్పుడు వేరే షీట్‌పై సంతకాలు చేసి మధ్యాహ్నం 12 గంటల్లోపు అటెండెన్స్ షీట్‌ను కలెక్టర్‌కు చేరవేశారు. అనంతరం కలెక్టర్ వివిధ ప్రాంతాల నుండి తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలకు తగు పరిష్కారాలు సూచించారు. అనంతరం కలెక్టర్ స్పందిస్తూ.. ప్రతీ అధికారి తప్పనిసరిగా ప్రజావాణికి హాజరు కావాలన్నారు. తప్పని పరిస్థితి అయితే ముందుగా అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన. హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్, ఆర్డీఓ మధు. డీపీఓ దిలీప్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవిపల్లిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతన్నల నిరసన.. మల్లన్న సాగర్ నీళ్లు ఇవ్వాలని డిమాండ్

సమస్యల పరిష్కారానికి సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం లక్ష్మీదేవిపల్లిలో అన్నదాతలు రోడ్డెక్కారు. సిద్దిపేట ? ముస్తాబాద్ రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. రైతుబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని ఈ సందర్భంగా రైతులు డిమాండ్ చేశారు. అలాగే రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ద్వారా సాగుకు కాల్వల ద్వారా నీటిని విడుదల చేయాలన్నారు. ఈ ధర్నాలో నారాయణపేట మండలంలోని బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్‌లు, మాజీ ప్రజా ప్రతినిధులు రైతులకు సంఘీభావంగా ధర్నాలో పాల్గొన్నారు.



# ఏపీలో కొత్త రాజకీయ పార్టీ

విజయవాడ, మార్చి 2, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో రెడ్డి సామాజిక వర్గం కొత్త రాజకీయ వేదిక కోసం ఆలోచిస్తున్నదా అనే ప్రశ్న తాజాగా చర్చకు వస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి తమకు ప్రత్యేక రాజకీయ పార్టీ అవసరమనే భావన కొంతమంది నేతల్లో బలపడుతున్నట్లు సమాచారం. ఈ దిశగా రాష్ట్రంలోని సీమ ప్రాంతం తో పాటు నెల్లూరు ప్రాంతానికి చెందిన నాయకులు చర్చలు జరుపుతున్నారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెడ్డి వర్గం పెద్దఎత్తున మద్దతు ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే తరువాతి కాలంలో తమకు తగిన ప్రాధాన్యం దక్కలేదనే భావన ఆ వర్గంలో పెరిగిందని అంటున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో రెడ్లకు ఇవ్వాల్సిన అవకాశాలు ఇతర వర్గాలకు కేటాయించారనే అసంతృప్తి వ్యక్తమైంది. అలాగే పరిశ్రమలు, వ్యాపార రంగాల్లో ఉన్న ప్రముఖులను కూడా ప్రభుత్వం ప్రోత్సహించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2024 ఎన్నికల ఫలితాల తర్వాత పరిస్థితి మరింత మారిందని విశ్లేషకులు అంటున్నారు. పార్టీ ఓటమి అనంతరం రెడ్డి వర్గంతో ప్రత్యేక సమావేశాలు జరగకపోవడం, వారి సమస్యలపై చర్చలు లేకపోవడం అసంతృప్తికి దారితీసిందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తమకు సొంత రాజకీయ వేదిక ఉండాలనే ఆలోచన కొంతమంది నాయకుల్లో బలపడుతోంది. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల వైపు కూడా కొంత ఆశతో చూసినప్పటికీ, ఆమె రాజకీయ వ్యూహాలు భిన్నంగా ఉండటంతో పెద్దగా ఆకర్షణ కలగలేదని అంటున్నారు. తెలుగుదేశం పార్టీలో కూడా రెడ్డి వర్గానికి ప్రాధాన్యం ఉందని చెప్పినా, క్షేత్రస్థాయిలో ఆశించినంత స్థాయి లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. భారతీయ జనతా పార్టీ పై హిందుత్వ ముద్ర ఉండటంతో అందరూ ఆ దిశగా వెళ్లడం లేదని చెబుతున్నారు. జనసేన పార్టీ విషయంలో కూడా పెద్ద ఎత్తున మద్దతు కనిపించడం లేదని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఈ పరిణామాల మధ్య తెలంగాణ లో నివసిస్తున్న ఏపీకి చెందిన రెడ్డి నాయకులతో కూడా సంప్రదింపులు జరుగుతున్నట్టు సమాచారం. త్వరలో హైదరాబాద్ లో విస్తృత స్థాయి చర్చలు నిర్వహించే ఆలోచన ఉందని చెబుతున్నారు. ఒకవేళ కొత్త పార్టీ ఆవిర్భవిస్తే రాష్ట్ర రాజకీయ సమీకరణాలు మారే అవకాశముందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ అంశంపై అధికారిక ప్రకటన ఏదీ వెలువడలేదు. కాంగ్రెస్ పార్టీ అంటేనే రెడ్డి సామాజిక వర్గం. అంతలా ఉండేది ఆ పార్టీలో సామాజిక వర్గ ప్రభావం. అటువంటి కాంగ్రెస్ పార్టీ ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న తరుణంలో.. వైయస్ రాజశేఖర్ రెడ్డి కాంగ్రెస్ బాధ్యతలు తీసుకున్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు సుదీర్ఘ పాదయాత్ర చేశారు. రాజశేఖర్ రెడ్డి నాయకత్వం కింద రెడ్డి సామాజిక వర్గమంతా పనిచేసింది. దీంతో 2004లో తొలిసారిగా అధికారంలోకి వచ్చింది. 2009లో సైతం రెండోసారి అధికారం చేపట్టింది కాంగ్రెస్ పార్టీ. దానికి ముమ్మాటికి కారణం రెడ్డి సామాజిక వర్గం మద్దతు. రాజశేఖర్ రెడ్డి మరణంతో రెడ్డి సామాజిక వర్గమంతా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గూటికి చేరింది. ఆ సామాజిక వర్గమంతా జగన్మోహన్ రెడ్డిని ఓన్ చేసుకున్నారు. కానీ ఆయన అనుకున్న స్థాయిలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యం ఇవ్వలేదు. రెడ్డి సామాజిక వర్గం నియోజకవర్గాల్లో సైతం ఇతరులకు అవకాశాలు కల్పించారు జగన్మోహన్ రెడ్డి. తన ఐదేళ్ల పాలనలో రెడ్డి సామాజిక వర్గానికి ప్రత్యేకంగా ఒనగూరే ప్రయోజనాలు లేకుండా పోయాయి. దీంతో ఆ సామాజిక వర్గం మొన్నటి ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సహాయ నిరాకరణ చేసింది. అయితే ఓటమి తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డి వైఖరిలో మార్పు రావడం లేదు. రెడ్డి సామాజిక వర్గం విషయంలో ప్రత్యేక ఆలోచనలు చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో తమకోసం ఒక ప్రత్యేక రాజకీయ పార్టీ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి రెడ్డి సామాజిక వర్గం ప్రముఖులు వచ్చినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ వేదికగా ఇందుకు సంబంధించి సన్నాహక సమావేశాలు నిర్వహించేందుకు రెడ్డి సామాజిక వర్గం ప్రముఖులు నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఒక ప్రత్యేక అజెండాతో ముందుకు సాగుతూ.. ఎన్నికల సమయానికి కలిసివచ్చే రాజకీయ పార్టీలతో ముందడుగు వేసేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే రెడ్డి సామాజిక వర్గానికి సంబంధించి రాజకీయ పార్టీ ఏర్పాటుకు మరికొద్ది నెలలో ఒక తుది రూపు వచ్చే అవకాశం ఉంది. చూడాలి మరి ఏం జరుగుతుందో? కానీ రెడ్డి సామాజిక వర్గంలో జరుగుతున్న చర్చలు మాత్రం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఒకవేళ ఆ వర్గం ఏకమై కొత్త దిశగా అడుగులు వేస్తే, అది ముఖ్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాల్‌గా మారే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

## వైఎస్ వివేక కేసులో కొత్త ట్విస్ట్

కడప, మార్చి 2, (మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి దారుణ హత్య కేసులో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ దర్యాప్తు మళ్లీ ఊపందుకుంది. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత అధికారులు విచారణను ముమ్మరం చేశారు. ఈ క్రమంలో కడప జిల్లా పులివెందుల కేంద్రంగా కీలక వ్యక్తుల విచారణ ప్రక్రియను సీబీఐ బృందం తిరిగి ప్రారంభించింది. ఈ కేసులోప్రధాన నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి బంధువులపై సీబీఐ అధికారులు దృష్టి సారించారు. ఇందులో భాగంగా సునీల్ యాదవ్ సోదరుడు కిరణ్ కుమార్ యాదవ్, అలాగే భరత్ కుమార్ యాదవ్ సోదరుడు మహేంద్ర యాదవ్‌లకు విచారణకు హాజరుకావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. పులివెందుల పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న అధికారుల ఎదుట మహేంద్ర యాదవ్ ఇప్పటికే విచారణకు హాజరుకాగా.. కిరణ్ కుమార్ యాదవ్ విచారణకు రానున్నట్లు సమాచారం. ప్రస్తుత విచారణలో ( అత్యంత కీలకమైన అంశం కిరణ్ యాదవ్, అర్జున్ రెడ్డిల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలే. సుప్రీంకోర్టు సూచనల మేరకు వీరిద్దరి కాల్ డేటాపై సీబీఐ లోతుగా దర్యాప్తు చేస్తోంది. వివేకానందరెడ్డి హత్య జరిగిన రోజు రాత్రి అనగా.. తెల్లవారుజామున సరిగ్గా 1:42 గంటల సమయంలో కిరణ్ యాదవ్ నుంచి అర్జున్ రెడ్డికి ఒక వాట్సాప్ కాల్ వెళ్లినట్లు దర్యాప్తులో వెలుగుచూసింది. హత్య జరిగిన సమయానికి అత్యంత చేరువలో, పైగా అర్ధరాత్రిపూట ఈ కాల్ వెళ్లడం దర్యాప్తు అధికారుల అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఆ సమయంలో వీరిద్దరి మధ్య అసలు ఏం చర్చ జరిగింది? వివేకా హత్యకు, ఈ కాల్‌కు ఉన్న లింక్ ఏంటి? అన్న కోణంలో అధికారులు కూపీ లాగుతున్నారు. కాగా, ఈ ఫోన్ కాల్ వ్యవహారంపైనే ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లో సైతం వీరిద్దరినీ సీబీఐ అధికారులు సుదీర్ఘంగా ప్రశ్నించారు. తాజా పులివెందుల విచారణతో ఈ కేసు దర్యాప్తు ఏ మలుపు తిరుగుతుందోనన్న ఉత్కంఠ స్థానికంగా నెలకొంది

## కాణిపాక ఆలయానికి మహర్దశ



కాకినాడ, మార్చి 2, ఏపీలో ప్రముఖ పుణ్యక్షేత్రం చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి మహర్దశ పట్టనుంది. స్వామి వారి ఆలయంలో ప్రస్తుతం ఉన్న గోశాలతో పాటు కొత్తగా మరో గోశాల ఏర్పాటు కానుంది. అందుకు 10 ఎకరాల భూమిని కొనుగోలు చేసి గోశాలను ఏర్పాటు చేయనున్నట్లు పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీ మోహన్ వెల్లడించారు. ఆలయ ఛైర్మన్ ఎం.మణి నాయుడుతో కలిసి పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో పాలకమండలి సమావేశం నిర్వహించారు .అందుకు సంబంధించిన వివరాలను మీడియాకు తెలియజేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తయారు చేసిన రూ.141.65 కోట్ల ఆలయ బడ్జెట్ అంచనాలకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. తవణంపల్లె మండలం కె.పట్నం వద్ద ఆలయానికి 18.60 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఇటీవల ఏపీ ప్రభుత్వ కేబినెట్ తీసుకున్న నిర్ణయంపై సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. దాంతో పాటుగా ఆలయంలో భూగర్భ విద్యుత్తు వ్యవస్థను ఏర్పాటు చేయడానికి సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు వెల్లడించారు. కాంట్రాక్ట్ బేసిస్ కింద పని చేస్తున్న 109 మంది ఉద్యోగులను యథావిధిగా పాత పద్ధతిలో పని చేసేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్‌కు ఆలయ కమిటీ తరపున లేఖ రాస్తామని వివరించారు. ఇక తిరుమలలోని అన్నమయ్య భవనంలో శనివారం (ఫిబ్రవరి 28) టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఒంటిమిట్టలో 108 అడుగుల జాంబవంతుడి విగ్రహం, డ్రై ఐలాండ్ నిర్మాణానికి రూ.20.17 కోట్లు మంజూరు చేస్తూ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ ఆలయాల్లో పరిచారకులుగా పనిచేస్తున్న 51 మందికి అర్చకులుగా పదోన్నతి కల్పించే విషయమై ఏపీ ప్రభుత్వానికి నివేదించాలని డిసైడ్ అయ్యారు. దేశవ్యాప్తంగా ఉన్న టీటీడీ ఆలయాలు, ఆసుపత్రులు, సత్రాలు, కల్యాణ మండపాల భద్రతను పర్యవేక్షించేందుకు తిరుపతిలోని పరిపాలన భవనంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. అందుకు రూ.10.75 కోట్లు ఖర్చు చేయనున్నారు. అలిపిరి తనిఖీ కేంద్రంలో రూ.8 కోట్లతో నూతన ఎక్స్-రే బ్యాగేజ్ స్కానర్లు, డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు.

# కలకలం రేపుతున్న డీప్ ఫేక్ వీడియోలు

తిరుమల మార్చి 2,సోషల్ మీడియా వేదికగా తనపై అసత్య ప్రచారాలు చేస్తున్నారంటూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బి.ఆర్. నాయుడు తీవ్రంగా స్పందించారు. కొందరు వ్యక్తులు నకిలీ డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి, తన వ్యక్తిగత ప్రతిష్టను భంగపరచడమే కాకుండా, పవిత్రమైన టీటీడీ సంస్థ గౌరవాన్ని దిగజార్చేందుకు కుట్ర పన్నారని బీఆర్ నాయుడు ఆరోపించారు. ఈ మేరకు అప్రతిష్ట పాలు చేసేలా సాగుతున్న ఈ ప్రచారాన్ని అరికట్టాలని కోరుతూ ఆయన సైబర్ క్రైమ్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఆధునిక ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ తన రూపాన్ని అనుకరించేలా కృత్రిమ వీడియోలను తయారు చేశారని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు. ఈ వీడియోల్లోని కంటెంట్ అంతా పూర్తిగా అసత్యమని, కావాలనే వక్రీకరించి ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేశారు. టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేందుకు పక్కా పథకం ప్రకారం ఈ కుట్ర సాగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నకిలీ డీప్ ఫేక్ వీడియోలతో కొందరు సోషల్ మీడియాలో నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. వ్యక్తిగతంగా నన్ను అప్రతిష్ట పాలు చేసేందుకు, తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దిగజార్చేందుకు కుట్రలు చేస్తున్నారు. ఏఐ సాంకేతికతను వాడుకుని నా రూపం అనుకరించే విధంగా వీడియోలు తయారు చేసి ప్రచారం? ఈ దుష్ప్రచారం వెనుక రాజకీయ దురుద్దేశాలు ఉన్నాయని బి.ఆర్. నాయుడు ఆరోపించారు. ప్రధానంగా వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు తనపై ఈ తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని, దీనిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ, భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న టీటీడీ ప్రతిష్టను దెబ్బతీస్తున్న ఇటువంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. సైబర్ క్రైమ్ విభాగం తన ఫిర్యాదుపై స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ నాయుడు కోరారు. డీప్ ఫేక్ కంటెంట్‌తో ప్రముఖుల జీవితాలతో ఆటాడుకునే ప్రయత్నం చేస్తున్నాయి అసాంఘిక శక్తులు. దారి తప్పిన వారి చేతుల్లోఉన్న రాజకీయ పార్టీలు ఇలాంటివి బరి తెగింపుతో చేస్తూనే ఉన్నాయి. ఇలాంటి వీడియోలు సోషల్ మీడియాలో వదిలేసి..విపరీతంగా ప్రచారం చేస్తున్నారు. కానీ వాటికి బాధ్యత తీసుకోవడంలేదు. మాకు సంబంధం లేదని.. అవి సోషల్ మీడియాలో వచ్చాయి కాబట్టే తాము ప్రచారం చేస్తున్నామని చెబుతూంటారు. అంటే.. వారే క్రియేట్ చేసి.. వారే తమ హ్యాండిల్స్ లో ప్రచారం చేసి.. కానీ అవి సోషల్ మీడియాలో వచ్చినట్లే చెబుతూంటారు కానీ.. అవి నిజమైనవే అని చెప్పరు. అలా చెబితే అది ఫేక్ అని తేలితే వారిపైనే కేసులు పడతాయి కాబట్టి.వైసీపీ ప్రధాన వ్యూహం మొదటి నుంచి ఒకటే. ఎదుటి వారిపై బురద చల్లేయడం. వారు తుడుచుకుంటూంటే..

ఆనందించడం. ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు పంపడం. ఇప్పుడు లడ్డూ కల్తీ కేసులో టీటీడీని అన్ని విధాలుగా టార్గెట్ చేస్తున్నారు. ఇప్పుడు టీటీడీ చైర్మన్ ను టార్గెట్ చేశారు. ఆ వీడియో ఫేక్ కాకపోతే నిజం అయితే వైసీపీ దీన్ని అసలైనదేనని ప్రకటించి ముందు ఉండి పోరాడాలి. సోషల్ మీడియా వెనుక దాక్కోకూడదు. అది ఫేక్ అయితే వైసీపీనే బాధ్యత తీసుకుని కేసులను ఎదుర్కోవాలి. ఈ వీడియోతో మాకు సంబంధం లేదని.. సోషల్ మీడియాలో తిరుగుతోంది కాబట్టి తాము ప్రచారం చేస్తున్నామని .. రచ్చ చేస్తే మాత్రం వైసీపీ కుట్ర బుద్ధి బయటపడినట్లే. పోలీసులు ఈ డీప్ ఫేక్ వీడియో ఎక్కడ క్రియేట్ అయిందో తెలుసుకుని వారి విషయం తేల్చాలి. ఇలాంటివి నిర్లక్ష్యం చేస్తే.. రేపు మరొకరి మీద చేస్తారు. అలాంటి వీడియోలకు హద్దే లేకుండా పోతుంది. వ్యవస్థలో ఉన్న లోపాలను అడ్డం పెట్టుకుని ఇతరుల వ్యక్తిత్వంపై దాడులు చేసి.. నీతి లేని తమ నేతలతో సమానం చేయాలనుకుంటారు. ఒక వేళ ఆ వీడియో నిజం అయితే నైతిక కోణంలో టీటీడీ చైర్మన్ ను ప్రశ్నించడానికి సర్వ హక్కులు ఉంటాయి. అందులో అంత అభ్యంతరకరమైనది ఏమీ లేకపోయినా.. టీటీడీ చైర్మన్ గా ఉన్న త స్థానంలో ఉన్న వ్యక్తి నైతిక విలువలు పాటించాల్సి ఉంటుందని ప్రశ్నించవచ్చు.

# ప్రమాద తీవ్రతకు కారణమదేనా..భరోసా ఏదీ

కాకినాడ, మార్చి 2, కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలోని బాణసంచా తయారీ కేంద్రంలో చోటుచేసుకున్న భారీ పేలుడు ఘటన యావత్ రాష్ట్రాన్నిగ్రాంతికి గురిచేసింది. ఈ ఘోర ప్రమాదంలో సుమారు 20 మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత బాధాకరం. విస్ఫోటనం సంభవించిన వెంటనే మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడటమే కాకుండా, దాదాపు రెండు గంటల పాటు వరుసగా పేలుళ్లు సంభవించాయి. దీనివల్ల ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు కూడా ఘటనా స్థలానికి చేరుకోలేకపోయారు. చివరకు కొందరు స్థానికులు ధైర్యం చేసి అక్కడికి వెళ్లేసరికే చాలామంది అగ్నికీలలకు ఆహుతయ్యారు. చెల్లాచెదురుగా పడి ఉన్న శరీర భాగాలు అక్కడ నెలకొన్న భీతావహ పరిస్థితికి అద్దం పట్టాయి. ఈ ప్రమాద తీవ్రత పెరగడానికి ఆ ప్రాంత భౌగోళిక పరిస్థితులు కూడా ఒక కారణమని తెలుస్తోంది. బాణసంచా కేంద్రం వరి పొలాల మధ్య ఉండటం, వెళ్లేందుకు సరైన రహదారి లేకపోవడంతో ఫైరింజన్లు, అంబులెన్స్‌లు సకాలంలో చేరుకోలేకపోయాయి. బురదమయంగా ఉన్న పొలాల కారణంగా సహాయక



చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. తీవ్రంగా గాయపడిన వారిని అతికష్టం మీద కాకినాడ జీజీహెచ్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ చికిత్స పొందుతున్న వారిలో వేట్లపాలెంకు చెందిన కప్పా వెంకట లక్ష్మి, పెద్దాపురం వాసి మోర్తా శ్రీనుతో పాటు సామర్లకోటకు చెందిన కె. శ్రీను, చిటికెల లక్ష్మి ఉన్నారు. ఈ విపత్కర సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉ ంటామని ప్రభుత్వం ప్రకటించింది. వేట్లపాలెం బాణసంచా కేంద్రంలో జరిగిన ఘోర ప్రమాదంపై కాకినాడ ఆర్‌డీవో మల్లిబాబు స్పందించారు. ఈ తయారీ కేంద్రానికి సంబంధించి అన్ని అనుమతులు ఉన్నాయని, ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు లైసెన్స్ గడువు ఉందని వివరించారు. అయితే, ప్రమాదం జరిగిన వెంటనే ఘటనకు బాధ్యుడైన యజమాని అక్కడి నుండి పరారయ్యాడని, ప్రస్తుతం అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని అధికారులు తెలిపారు. ప్రాథమిక విచారణ ప్రకారం, వరి పొలాల మధ్య ఆరు షెడ్లలో ఈ బాణసంచా తయారీ సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ పెను ప్రమాదం జరిగిన సమయంలో కొందరు కార్మికులు భోజనం నిమిత్తం షెడ్ల నుండి బయటకు వెళ్లడం వారి ప్రాణాలను కాపాడింది. లేనిపక్షంలో మరణాల సంఖ్య మరింత ఎక్కువగా ఉండేదని స్థానికులు చెబుతున్నారు. విస్ఫోటనం జరిగిన ధాటికి వేట్లపాలెం గ్రామంలోని పలు ఇళ్ల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఈ ఘటన స్థానికులను తీవ్ర భయాందోళనలకు గురిచేసింది. ప్రస్తుతం కాకినాడ జీజీహెచ్ లో ఆరుగురు బాధితులు మృత్యువుతో పోరాడుతున్నారు. వీరిలో వేట్లపాలెంకు చెందిన కప్పా వెంకట లక్ష్మి, పెద్దాపురం నివాసి మోర్తా శ్రీను, సామర్లకోటకు చెందిన కె. శ్రీను మరియు చిటికెల లక్ష్మి ఉన్నారు. మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. ప్రమాదం అనేది చెప్పి రాదు.. అలాగని నిర్లక్ష్యం చేయకూడదు. కానీ నిన్న వేట్లపాలెంలో జరిగిన ప్రమాదం దురదృష్టకరం. దానిని రాజకీయ కోణంలో ఎంత మాత్రం చూడకూడదు. అలా చూస్తే దాని కంటే మహా పాపం ఉండదు. ఘటన జరిగి దాదాపు 24 గంటలు అవుతోంది. ఇప్పటికే సీఎం చంద్రబాబు ఘటనా స్థలానికి వెళ్లారు. బాధితులను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు నష్టపరిహారం అందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించారు. అయితే ఏదైనా ఘటన జరిగినప్పుడు గంటల వ్యవధిలో పరామర్శిస్తేనే దానికి బాధ్యత అంటారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి తీరుబాటుగా రేపు బాధితుల పరామర్శకు వెళ్తున్నారు. అయితే ఆయన పరామర్శలపై అనేక రకాల విమర్శలు ఉన్నాయి. బాధితులతో ఆయన కేవలం ఐదు నిమిషాలు మాత్రమే గడుపుతారు. కానీ దానికోసం చేసే హంగామా మాత్రం గంటల తరబడి సాగుతుంది. రోడ్లను దిగ్బంధించడం, వేలాది మందితో బలప్రదర్శనకు దిగడం పరిపాటైన విద్యగా మారింది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బాధితులను నిశ్శబ్దంగా వెళ్లి సాయం చేయవచ్చు. కానీ భారీ ఎలివేషన్స్ నడుమ సాయం చేస్తుంటారు. విషాద ఘటనల సమయంలో బాధితుల పరామర్శకు వెళ్ళినప్పుడు పూల వర్షాలు, నినాదాలు, రప్పా రప్పా ఫ్లెక్సీల మధ్య యాత్రలు సాగిస్తుంటారు జగన్ మోహన్ రెడ్డి. పరామర్శించే క్రమంలో రాజకీయం చేయడం మాత్రం ఎంత మాత్రం తగదు. ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి పట్ల ఒక రకమైన విమర్శ ఉంది. నిన్ననే వేట్లపాలెం లో ఘటన జరిగింది. ఆ సమయంలో ఒక్క వైసీపీ నేత కూడా అటువైపు చూడలేదు. అయితే ఇప్పుడు అధినేతను తీసుకొని రేపు బయలుదేరుతున్నారు. ఘటన జరిగినప్పుడు అధికారులు నానా హైరానా పడుతుంటారు. దానికి మించి అన్నట్టు జగన్ పర్యటన సమయంలో ఉంటుంది.

# జగన్ పార్టీకి వరుస కష్టాలు

విజయనగరం, మార్చి 2,వైసీపీ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలో నేనున్నాను అంటూ ముందుకు వచ్చారు రాజశేఖర్ రెడ్డి. అప్పటివరకు కాంగ్రెస్ పార్టీలో ఎంతోమంది నేతలు ఉన్నారు. అందులో రాజశేఖర్ రెడ్డి ఒకరు. పార్టీలో సైతం చాలా పదవులు చేపట్టారు. అయితే తెలుగుదేశం పార్టీ ప్రాబల్యం పెరుగుతున్న క్రమంలో.. ఎలాగైనా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలన్న కసి నాయకుల్లో ఉండేది. దానిని గుర్తించారు రాజశేఖర్ రెడ్డి. ఉమ్మడి రాష్ట్రంలో ప్రతి జిల్లా నుంచి చురుకైన నాయకులను గుర్తించారు. అలా పుట్టుకొచ్చిన వారే ఒక బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, కొణతాల రామకృష్ణ వంటి నేతలు. అయితే కార్యక్రమంలో ఎటువంటి నేతలంతా జగన్మోహన్ రెడ్డి కొడుకు కిందకు చేరారు. కాని వారిని సరిగ్గా సద్వినియోగం చేసుకోలేకపోయారు జగన్మోహన్ రెడ్డి. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. పార్టీని నడిపే నాయకుడు కూడా లేరు. బొత్స సత్యనారాయణ లాంటి బీసీ నేత జగన్మోహన్ రెడ్డికి ఒక రక్షణ వలయంగా నిలిచారు. అయితే దానిని గుర్తించిన జగన్మోహన్ రెడ్డి విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఆయనకు అవకాశం ఇచ్చారు. మండలిలో వైసీపీ పక్ష నేతగా కూడా ఛాన్స్ కల్పించారు. తనకున్న పాత పరిచయాల ద్వారా ఉత్తరాంధ్రలో పార్టీని బలోపేతం చేసే పనిలో పడ్డారు బొత్స. అయితే ఈ క్రమంలో బొత్స అనారోగ్యానికి గురికావడం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద షాక్. ఆ స్థాయిలో ఇప్పుడు ఎవరు పనిచేస్తారు అనేది ఒక ప్రశ్న. రకరకాల పేర్లు తెరపైకి వచ్చినా.. బొత్స స్థాయిలో ప్రభావం చూపే నేతల మాత్రం ఎంత మాత్రం లేరని చెప్పవచ్చు. ప్రస్తుతం ఉత్తరాంధ్రలో పెద్దదిక్కుగా ఉన్నారు ధర్మాన ప్రసాదరావు . సుదీర్ఘకాలం ఆయన శ్రీకాకుళం జిల్లా నుంచి మంత్రిగా పనిచేశారు. మొన్నటి ఎన్నికల్లో ఓ సాధారణ సర్పంచ్ చేతిలో ఓడిపోయారు. అది కూడా దారుణంగా 52 వేల ఓట్ల తేడాతో. ఆయన గెలిచినప్పుడు మాత్రం చాలా తక్కువ మెజారిటీతో బయటపడుతున్నారు. పైగా మునుపటి మాదిరిగా ధర్మాన దూకుడుగా వ్యవహరించలేకపోతున్నారు. ఆయన కేవలం శ్రీకాకుళం జిల్లా నేత మాత్రమే. ఉత్తరాంధ్ర పై ప్రభావం చూపేటంత శక్తి, బలం లేదన్నది ఒక బహిరంగ రహస్యం. ఆయన తమ్ముడు కృష్ణ దాస్ పరిస్థితి కూడా అంతే. పోనీ తమ్మినేని సీతారాం ద్వారా ప్రయత్నాలు చేద్దాము అంటే ఆయన వాగ్దాటి వరకే పరిమితం. కేవలం శ్రీకాకుళం జిల్లా వరకే ఆయన పేరు ప్రముఖంగా వినిపిస్తూ ఉంటుంది. డాక్టర్ సీదిరి అప్పలరాజు, గుడివాడ అమర్నాథ్ వంటి నేతలు ఉన్న ఎంత మాత్రం ప్రభావం చూపలేరు. అయితే ఇప్పుడు బొత్స కు అనారోగ్యం కావడంతో ఏదో ఒక నాయకుడికి ఇప్పుడు బొట్టు పెట్టాల్సిందే. లేకుంటే మాత్రం ఉత్తరాంధ్రలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలపడే అవకాశాలు సన్నగిల్లుతాయి.

## నేడు చంద్రగ్రహణం సందర్భంగా సూర్య దేవాల యం ప్రత్యేకంగా శాంతి పూజలు...



విభారే న్యూస్ మార్చి 2 కర్నూలు జిల్లా ప్రతినిధి..జయగురుదత్త శ్రీ గురుదత్త శ్రీ శ్రీ శ్రీ గణపతి సచ్చిదానంద సద్గురుభ్యోనమః (03-03-2026 మంగళవారం) స్వస్తిశ్రీ విశ్వవసు నామ సంవత్సర ఫాల్గునమాసం శుక్ల పూర్ణిమ మంగళవారం పుబ్బా నక్షత్ర నక్షత్ర సింహరాశి కర్కాటకలగ్నము లందు కేతుగ్రస్త చంద్రగ్రహణం సంభవించును. చంద్రగ్రహణ సమయములు 1) గ్రహణ స్పర్శ కాలం-(మ. 03.19 ని. )2) మధ్యకాలం-(సా. 05- 03ని. )3) మోక్ష కాలం-(సా.06 -47ని.)పుబ్బ నక్షత్రం సింహరాశి వారు గ్రహణం చూడరాదు సింహం వృషభం మకర కన్య రాశిల వారు కూడా గ్రహణ శాంతి చేసుకోవలెనుగ్రహణ దానంబియ్యము. ఉలవలు వెండి సర్పంప్రతిమ చంద్ర ప్రతిమ దానం చేయవలెనుబుధవారం 4-3-2026 ఉదయం 9.గంటలకు చంద్రగ్రహణ శాంతి హోమం నిర్వహించబడునుచంద్రగ్రహణ హోమం ప్రధానంగా 2500చంద్రగ్రహణ హోమ సంకల్పం 116సంప్రదించిన నంబర్లు 798101278 76300654954దేవాలయం ఫోన్ పే గూగుల్ పే నెంబరు..8896123777

## భవన కార్మికులకు సంక్షేమ పథకాలు--

### అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ ఎన్ బషిరున్నీసా బేగం--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 02:జిల్లాలోని నమోదిత భవన నిర్మాణ కార్మికులకు 01-03-2026 నుండి పలు సంక్షేమ పథకాలు



అమలు చేస్తున్నట్లు అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ ఎన్. బషిరున్నీసా బేగం సోమ వారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. వివాహ సహాయం కింద రూ.40,000, రెండు కాన్పులకు రూ.20,000, సహజ మరణానికి రూ.,60,000, దహన సంస్కార ఖర్చులకు రూ.20,000 ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. 01-03-2026 తర్వాత జరిగిన సంఘటనలకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు.నమోదిత కార్మికులు లేబర్ కార్డులు తప్పనిసరిగా రీన్యువల్ చేసుకుని అవసరమైన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ ఆఫ్ లేబర్ ఆఫీసర్ ఎన్. బషీరున్నీసా బేగం సూచించారు.

## మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించాలి--

### మార్చి 2 నుంచి 20 వరకు--

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 02 :-అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్లో ప్రజా పరిష్కార వేదిక అనంతరం మహిళా దినోత్సవ గోడపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రామునాయక్, ఐసిడిఎస్ పిడి లీలావతి దేవి తదితరులు పాల్గొన్నారు.మార్చి 8న జరిగే మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మార్చి 2 నుంచి 20 వరకు వివిధ అవగాహన, శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. మహిళా సాధికారత, ఆర్థిక అక్షరాస్యత, సైబర్ భద్రత, సురక్షిత మాతృత్వం, బేటీ బచావో బేటీ పఢావో, మానసిక ఆరోగ్యం, గృహహింస నిరోధం, నైపుణ్యాభివృద్ధి, మహిళా వ్యవస్థాపకత, కెరీర్ మార్గదర్శకత్వం తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామన్నారు.మహిళలు, బాలికలు, యువత పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొని మహిళా శక్తిని చాటాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.




## మతసామరస్యానికి ఇఫ్తార్ వేదిక--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 02-నంద్యాల పట్టణంలో భారతీయ వైద్య సంఘం ఐఎంఏ నంద్యాల శాఖ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని ఇఫ్తార్ విందు సమావేశం నిర్వహించారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఉపవాస విరమణ చేసి, మౌలానా అబ్దుల్ హాది ప్రార్థనలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎమ్ డి ఫరూక్ ముఖ్య అతిథిగా, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ ఎమ్ డి ఫిరోజ్ గౌరవ అతిథిగా హాజరయ్యారు.మంత్రి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. అన్ని మతాల



పర్వదినాలను ఐక్యంగా నిర్వహించడం ఐఎంఏ సాంప్రదాయమని అభినందించారు. వైద్యులు సేవా దృక్పథంతో ప్రజలకు సేవలందిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ వంటి పర్వదినాలను ఐఎంఏ ఆధ్వర్యంలో నిర్వహించడం ఐక్యతకు నిదర్శనమన్నారు.కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాస్, సీనియర్ వైద్యులు మరియు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులపై వేగవంతమైన పరిష్కారం---

### పీజీఆర్ఎస్ 262, రెవెన్యూ క్లినిక్స్ 130 అర్జీలు--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 02:ప్రజా ఫిర్యాదులను నాణ్యతతో, వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్



కొల్లాబత్తుల కార్తీక్, డిఆర్ఓ రామునాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితరులు పాల్గొన్నారు.ప్రస్తుతం కొన్ని అర్జీలు ఓపెన్ చేయకుండా ఉన్న విషయాన్ని గుర్తుచేసిన కలెక్టర్, ప్రతి దరఖాస్తును సమయానుకూలంగా పరిశీలించి పెండింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. రీ-ఓపెన్ అర్జీలపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, ఎండార్స్‌మెంట్లు స్పష్టంగా ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధుల వినతులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రెవెన్యూ క్లినిక్స్ ద్వారా భూసంబంధిత సమస్యలను క్షేత్రస్థాయిలో వేగంగా పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ వేదికలో మొత్తం 130 అర్జీలు స్వీకరించగా, సర్వే, ఆర్ఓఆర్, అసైన్డ్ భూములు, 22-ఎ, అడంగల్ సవరణలు తదితర అంశాలకు సంబంధించినవి ఉన్నాయని వివరించారు.పీజీఆర్ఎస్ ద్వారా మొత్తం 262 అర్జీలు స్వీకరించబడినట్లు అధికారులు తెలిపారు

## ప్రజా సమస్యల వేదికకు 72 ఫిర్యాదులు--

### జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 02 - నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్ ఫిర్యాదుదారుల నుండి 72 ఫిర్యాదులను స్వీకరించారు.జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలతో ఎస్పీ స్వయంగా మాట్లాడి ప్రతి ఫిర్యాదుపై పూర్తిస్థాయి విచారణ జరిపి చట్ట పరిధిలో న్యాయం చేస్తామని తెలిపారు. చట్టబద్ధమైన సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని, నిర్ణీత గడువులో ఫిర్యాదులను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు.ముఖ్య ఫిర్యాదులుపాణ్యం మండలానికి చెందిన




వెంకటసుబ్బయ్య తన 3.52 సెంట్ల వ్యవసాయ భూమి అమ్ముతామని చెప్పి ఆవుల రమేష్ నాయుడు 15 లక్షలు, హనుమంతు 26 లక్షలు తీసుకుని రిజిస్ట్రేషన్ చేయకుండా ఇతర వ్యక్తికి నమోదు చేసి మోసం చేశారని ఫిర్యాదు చేశారు. సంబంధితులపై చట్టరీత్యా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.ముష్టపల్లె గ్రామానికి చెందిన ఆదినారాయణ తన పిల్లలకు యోగా టీచర్ ఉద్యోగం ఇప్పిస్తామని శివశేఖర్ అనే వ్యక్తి 5 లక్షల 30 వేల రూపాయలు తీసుకుని ఉద్యోగం కల్పించకుండా డబ్బులు తిరిగి ఇవ్వమని అడిగితే బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశారు.సలీంనగర్ కు చెందిన షేక్ షేర్ అలీ తాను వెల్డింగ్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నానని, షేక్ మొహమ్మద్ రఫీ మట్టి పోసి రహదారి మూసివేసి ఇబ్బందులు కలిగిస్తున్నాడని పేర్కొంటూ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలిపారు.

## చంద్రగ్రహణం నేపథ్యంలో ఆలయం మూసివేత--

### ఎమ్ రామాంజనేయులు ఉప కమిషనర్--



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 02 :బేతంచెర్ల మండలం ఆర్.యస్.రంగాపురం గ్రామంలోని శ్రీ మద్దులేటి నరసింహ స్వామివారి దేవస్థానంలో మార్చి 03న సంభవించే పాక్షిక చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాన్ని తాత్కాలికంగా మూసివేయనున్నట్లు ఉపకమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి ఎం. రామాంజనేయులు తెలిపారు.మార్చి 03, మంగళవారం తెల్లవారుజామున 4:30 గంటలకు సుప్రభాత సేవ నిర్వహించి, అనంతరం అభిషేకం, ఉదయం 7:00 గంటలకు నివేదన కార్యక్రమాలు పూర్తి చేసిన తరువాత దేవాలయ ద్వారాలు మూసివేయబడతాయి. గ్రహణ కాలం ముగిసే వరకు భక్తులకు దర్శనం ఉండదని స్పష్టం చేశారు.తదుపరి రోజు మార్చి 04 తెల్లవారుజామున 4:30 గంటల నుండి ఆలయ సంప్రోక్షణ నిర్వహించి, ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 8:00 గంటలకు భక్తులకు స్వామివారి దర్శనం అనుమతించబడుతుందని పేర్కొన్నారు.గ్రహణం సందర్భంగా భక్తులు ఆలయ సమయాలను గమనించి సహకరించాలని దేవస్థానం అధికారులు విజ్ఞప్తి చేశారు.

## పథకాల అమలులో మెరుగుదల అవసరం--

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా-

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 02:ప్రభుత్వ ప్రాధాన్యత పథకాల అమలులో జిల్లాలో సానుకూలత శాతాన్ని పెంచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించి, ప్రజల ఆరోగ్యం, భద్రత, మౌలిక వసతుల విషయంలో



నిర్లక్ష్యం అసహ్యం అని హెచ్చరించారు.20 శాతానికి పైగా నెగిటివిటీ ఉన్న శాఖలు తక్షణమే కారణాలు తెలియజేయాలని ఆదేశించారు. ట్రాన్స్‌పోర్ట్, యూరియా సరఫరా, హౌసింగ్, మున్సిపల్ సేవలు, జీజీహెచ్ పనితీరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.70 శాతం పైగా సానుకూలత సాధించిన శాఖలను ఆదర్శంగా తీసుకుని, తక్కువ పనితీరు ఉన్న శాఖలు మెరుగుపడాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

## పరుగులు పెడుతున్న రేషన్ బియ్యం---

### సివిల్ సప్లయ్ అధికారుల నిర్లక్ష్యంపై విమర్శలు---

### డీలర్లపై ముక్కుమ్మడి చర్యల పై ఆరోపణలు---




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి , మార్చి 2:-జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ రవాణా ఆగకుండా కొనసాగుతోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సివిల్ సప్లయ్ అధికారులు ఉన్నప్పటికీ అక్రమ రవాణాపై కట్టడి కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. నెలవారీ మామూళ్ల వ్యవస్థ కారణంగానే అక్రమ రవాణా నిరాటంకంగా సాగుతోందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల కొంతమంది రేషన్ డీలర్లపై సస్పెన్షన్ చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. అయితే ఈ చర్యలు ఒకపక్షంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వెలువడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వ కాలంలో నియమితులైన డీలర్లపైనే ఎక్కువగా చర్యలు తీసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సస్పెండ్ చేసిన డీలర్లు కోర్టుల ద్వారా స్టే ఆర్డర్లు తెచ్చుకున్నా, తిరిగి వారి దుకాణాలపై ముక్కుమ్మడి దాడులు చేసి మళ్లీ సస్పెన్షన్ విధిస్తున్నారని పలువురు డీలర్లు ఆరోపిస్తున్నారు.తమపై జరుగుతున్న వరుస తనిఖీలు, దాడుల వల్ల తీవ్ర ఆందోళనకు గురవుతున్నామని రేషన్ షాపుల యజమానులు చెబుతున్నారు. నిజమైన అక్రమ రవాణా దారులను పట్టుకోవడం కంటే, చట్టబద్ధంగా పనిచేస్తున్న డీలర్లపై ఒత్తిడి తెస్తున్నారని వారు వాపోతున్నారు.అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఒకవైపు డీలర్లను లక్ష్యంగా చేసుకోవడం మానుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. రేషన్ బియ్యం సరైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని సూచిస్తున్నారు.జిల్లా అధికారుల సమగ్ర విచారణతో నిజానిజాలు వెలుగులోకి రావాలని పలువురు కోరుతున్నారు.

## తాసిల్దార్ కార్యాలయంలో పీజీఆర్ఎస్‌కు విశేష స్పందన--

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మార్చి 02:నంద్యాల అర్బన్ తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. తహశీల్దార్ శ్రీనివాసులు స్వయంగా పాల్గొని ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా భూ వివాదాలు, ఆన్లైన్ నమోదు లోపాల సవరణ, పత్తాదారు పాస్‌బుక్ సమస్యలు తదితర అంశాలపై పలు వినతిపత్రాలు అందాయి. ప్రతి ఫిర్యాదును సంబంధిత శాఖల అధికారులకు పంపిస్తూ సమగ్ర విచారణ జరిపి నిర్ణీత గడువులో పరిష్కరించాల్సిందిగా తహశీల్దార్ ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీమతి జి. రాజకుమారి గణియా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో తహశీల్దార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజల నుంచి అందిన వినతులను సత్వరమే, పారదర్శకంగా పరిష్కరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యతతో తీసుకొని వేగవంతంగా చర్యలు చేపట్టాలని ఆమె దిశానిర్దేశం చేశారు.ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**